# అడుక్కుదినక సేసేదేంది!

వూరికి ఎలపల వుండ ఆ పాడుబడ్డ కొట్టు మీన రేత్రిళ్ళు దెయ్యాలు అరుత్తా వుంటయ్యని ఆవూరి జనం సానామంది అనుకుంటారు.

రేత్తిరి పదిగెంటలయింది, కారుచీకటి. యాడ ఏంవుండదీ కన్నుబొడుసుకుండా కా(న్రాటంలా.

ఆ కొట్టుమీన రొండు యిగ్రహాలు కూకునుండై, గర్భగుళ్ళో అమ్మోర్లకి మల్లే. ఒక యిగ్రహం కళ్ళు మెరుత్తావుండయి. రెండో యిగ్రహం కళ్ళు మూసుకునుండై.

"తూత్ యింత సన్నాసివూరు నే నేడా సూళ్ళా" అంది కళ్ళుగల యిగ్రహం.

"అన్ని వూళ్ళూ యిట్టనే సచ్చినై!" అంది కళ్ళు మూసుకుండ యిగ్రహం.

"యింత వుప్పుగోంగూరముద్ద దొరికి మంచీలు తాగేటప్పటికి గనమైపాయె! తిరగంగా తిరగంగా సివరికి ఆ యమ్మ కాత్తెపప్పుశారుండది కావాలా అనడుగుతే అదే పదేలనుకుంటా దోసెట్టో అటనే తాగి సల్లగా యీడకి జేరుకుంటిని."

"యిగ ఈ పానాలు యిట్ల బోవల్చిందేలే! అయినా సావడం అంటే గబిక్కిన సావాలిగాని, యిదేంది యిదా పద్ధతి? పోనీ, ఆ ముసల్ది ఆడా, నేనీడా, ఆడకి వొదిలపోద్ది శని" అంటా తుబుక్కున వుమ్మేసింది కళ్ళుగల యిగ్రహం.

"పెల్లాం యాడన్నా వుండదా?" అంది కళ్ళుమూసుకుండ యిగ్రహం.

"పెల్లాం! మా అమ్మ దప్పితే నాకెవరూ లేరు."

"నీకు ఎన్నేళ్లేం?"

"ముప్పయి"

"అc! మాటపోకడ జూత్తే యాబయ్యేళ్ళకిమల్లే వుండది! బలేవోడివే!" అన్నది కళ్ళుమూసుకుండ యిగ్రహం.

కూసేపు ఆగిపోయినై యిగ్రహాల మాటలు.

"యిదుగో, నిదరబోతుండావా?" అంది కళ్ళుమూసుకుండ యిగ్రహం కొంతలెక్కపోయినాక.

"నిద్ర రావటంలా నాకు" అంది కళ్ళుగల యిగ్రహం.

"ఎవరన్నా యిట్టనే జతపడ్తా వుంటారా, అదిదంటా ఏదన్నా కూసేపు మాట్టాడంది నాకు దోసదు సెప్పొద్దూ."

"నువామాట అనకుండా వుంటే యింకూసేపు జూసి నేనే అడిగేవోణ్ని." అస లీ చీకటి తిక్కవుట్టిత్తుందది!"

"నా కా దిగులేం లేదులే!" అంది కళ్ళు మూసుకుంద యిగ్రహం.

"ఔను. మరీ నయం, పెపంచకం ఆవజాన లేంది సోకే లేదూ!"

"మీది ఏ వూరేం?"

"అసలు దచ్చాదిన రెట్టపాడయితే నందెలుగు వొచ్చేశారు మా అయ్యోళ్లు."

"నందెలుగు ఏవిఁటికి రావల్సొచ్చిందీ?"

"ఆఁ అడుక్కుదిన్ను! యిప్పుడెందుకులే ఆ పురానం".

"అదిగో, అదే సిబుక్కుమంటది పానం! ఏందో యియ్యాలుండి రేపు సచ్చేదానికి – నువుగాంగా ఆ మాటన్నావు! మంచీసెబ్బరకొత్తే నువెంతో నేనంతే, ఏమంటా?"

"అంతేలే యెదవ బతుకులు."

"మరింకేం!"

"ఉంద కాత్తె కూత్తె బూవిఁ తుదుసుబెట్టుకుపోతే, కాత్తె బతికిన వూళ్ళో దేనికయినా నగుబాట్లపనవుద్దని నందెలుగో బొందెలుగో వొచ్చేశాదు మా అయ్య" అంది కళ్ళుగల యిగ్రహం.

"ఆహాఁ! ముంగల కాత్తె బూవిఁ వుందన్న మాట. ఎంతేం?"

"మూడెకరాల మెట్ట."

"అబ్బా! బాగానే తింటానికి వుండదన్నమాటా! తాగుడుగాని ముండలుగాని మరిగాడెట్టా మీ అయ్య?"

"ఛా! మా అయ్య మంచోడు. పోవటమే నదమంత్రంగా పోయిందయితే."

"అంటే?"

"మనగాడి సజ్జ పంట పండేది మా బూవిఁలో. తింటానికి కొంటానికి అదే నయమని ఏటా అదేపంట ఏసోవోళ్ళం. కొత్తపంటరాంగానే ఆ కోఁవటి సెంచయ్య కాద మిరబగాయ బొరబగాయ తాలూకు సేసిన అప్పూ, యింకేవన్నా సిల్లర బొల్లరవి ఉంటే తీర్చిబారేసి మిగతాయన్ని పురిగట్టి బోసేది. మళ్లీ వొచ్చే ఏటి పంటలొచ్చేదాకా ఆవజాన

తిండికి సరిపోతా వుండాల్సిందే. ఈ లోగా సెంచయ్య నాలిక బీక్కుండా ఒక్క గిద్దెడు గింజలన్నా బోసేదిలేదు."

"మరి యింటిముంగల కొచ్చే సెక్కిరాలూ, ముంతకజ్జాయం యిట్టాటియి కావల్సుంటే దబ్బులుండేయా?"

"డబ్బు గిబ్బు మన కవసరమే వుండేదిగాదు అప్పట్లో. అదుగో నువ్వు జెప్పినట్టు అయ్యేయన్నా కావాల్సొత్తే గిద్దో రెండుగిద్దలో సజ్జలే బోత్తే పని గడ్సి పొయ్యేది."

"ఏడాదంతా తిండికిమటుకు బాగా సరిపొయ్యేదంటావ్?"

"తరుగులు బొరుగులుండా ఇబ్బందిమటు కుండేదిగాదు."

"ఏడాదంతా బాకీఅడక్కబోటం జూత్తె మీవూరి కోవఁటి సెంచయ్య మంచోడల్లే వుందే?"

"ఆడా? ఆణ్ణి జూత్తేనే నా కసలు మొదట్నుంచీ గిట్టేదిగాదు. పందికొక్కులుండయి జూశా–అదీ ఆడి బుద్ధి. అప్పుడో పన అప్పుడోపనంటా మా సొప్పంతా ఎత్తికెల్లి ఆళ్ళ బఱ్ఱెల్ని మేపుకునేవోడు. ఎప్పుడన్నా అవసరానికి అప్పుబెడ్తే సెంచయ్యేగందా అని మా అయ్య ఆణ్ణేం అనేవోడు గాదు."

"మరి ఆళ్ళబుద్దీ అసువంటిదీ."

"కాత్తె ఒకేడు పంట ఎచ్చుతగ్గయితే ఒకట్రొండుబత్తాలు ఎక్కువ జేసుకుని బాకీ పైయ్యేటిదాకా ఆపేవోడేలే. మరి వాన్దేవుడిమీన ఆదారపడుంటదిగా మన పానం?"

"అందుట్టో మెట్టసేలాయె."

"యింతకీ మా రోజులు బాగుండకబోతే ఎవురేం జేత్తారు? అప్పటికే కొంత బాకీ నిల్సింది సెంచయ్య కాడ. ఒకేడు అసలు బొత్తిగా లేకపోటం – పైయ్యేటికి గాలివానలు దంచి సేలన్నీ మురుగెత్తటం వరసొరసన జరిగింది. మూడో ఏటికి సెంచయ్య గబిక్కిన మొత్తంబాకీ ముంగలబెట్టి అదంతా అప్పటికప్పుడు కక్కకపోతే కోరుటుకెక్కిత్తానని మా అయ్యను పొలం పంటమీనుండగా నిలేశాడు. యింకేం లాబం లేకబోయింది. వొడ్డీలు గిడ్డీలు మొత్తంజేరి తొమ్మిదొందల రూపాయల పైసిలుక్కు మా మూడెకరాల బూవీ బాకీకింద కట్టుకుండాడు సెంచయ్య. రెండురోజులు బోనిచ్చి మా గుడిసె వుండ స్థళం అయినకాడికి తెగనమ్మి ఒక రాత్రి మమ్ముల నందెలుక్కు పయానం గట్టిచ్చాడు మా అయ్య. అంతే, రెండుమూడు నెల్లుండి అయ్య జరంతో సావనే సచ్చాడనుకో" అంది కళ్ళుగల యిగ్రహం.

"అ రె రె రె రె ఎట్టాంటి పన్జరిగిందీ! నిచ్చేపవంటి బూమి ఆవజాన నీలుగారిపోయిందన్నమాట! హుఁ!" అన్నది కళ్ళు మూసుకుండ యిగ్రహం యిశారంగా.

"మొదులు ఒల్లూ కాలూ గుల్లయి, అలివేలు సంగతి అట్టయితే దిక్కు లేదు గాని ఎప్పుడో ఏందో పోయిందానికి ఎవుడో ఏడ్సాడంట!" అన్నది కళ్ళుగల యిగ్రహం యిసిరేసినట్టు.

"ఒల్లూ కాలూ గీలంటండావేందీ?"

"మరిగనేంది! అసలాడ ఏంలేందే యీ కొట్టుమీనకొచ్చి నీతో కూకుండానంటా? యీ కాల్తోగాదూ నా కతంతా అడ్డం దిరిగిందీ! లేకుంటే నా జనమలో ఒకణ్ణో కానీ దేబిరించి ఎరుగుదునా? ఎనకటికి శాత్రం వుండదిలే. బోడిగుండుమీన గొబ్బిరికాయ పడిందని! యింతకీ సెని తంతావుంటే యీ యదవకి అలివేలు ఎట్ట దక్కుద్దిలే!" అంటావుంది కళ్ళుగల యిగ్రహం.

"ఏంది నువనేదీ?" అంది కళ్ళు మూసుకుండ యిగ్రహం.

"నా సంగతేలే!"

"ఎవురో అలివేలంటే ఏవంటదబ్బా అనుకుండా!"

"నందెలుగులో ఒక కుర్రదిలే.'

"పానం దీత్తివే! అయితే అలివేలు వుండదన్న మాట,"

"నా బతుకు సాలా సెండాలబ్బతుకన్నా!"

"ఇంకో నిమసానికి ఏంజరుగుద్దో మనికి తెలవదుగందా? మనయి వొట్టి ముదనష్టబ్బతుకులు."

"నందెలుగులో మొదట అలివేల్ను వరికోతలకాడ సూసీ సూట్టంతలికే తిక్కబుట్టిందంటే నమ్ము. అసలట్టాటిదీ అలివేలు. యింకెవురయినా దానిముంగల బలాదూరే! ఆల్లమ్మ రంగమ్మ – గుర్రాలుంటాయి తెల్చుగా? తెగ ఎగురుద్దీ! దాంతోనే వొచ్చిందీ సావంతా. ఓనాడు ఏమయినా అయిద్దని ఎల్లి అలివేల్ను పెల్లి జేయమన్నా,"

"ఏమంది – రంగమ్మా?"

"యీలుగాదంది"

"ఏందీ యీలుగాందీ?"

"రంగమ్మ పెల్లి యీలుగాదంది."

"మరి అలివేలుకు నువంటే గురేగా?"

"పడి సచ్చుద్ది."

"మరి రంగమ్మ ఏమంటదీ?"

"తన కూతుర్ని పోశించను నా కాడ డబ్బులేదంట."

"ఆసి యదవా- పేసీ బెట్టిందే?"

"కాల్లకి కడాలూ, సెవలకి దుద్దులూ, ముక్కుకి పుడకలూ సేయిత్తే, ఒక ఏళ నాకు గుబుల్దిరిగి ఆళ్ళమ్మాయిని వొదిలేసినా ఆటితో కొన్నాలన్నా తన కూతురు బతకొచ్చునంట!"

"మరి నువేమన్నా?"

"అంటానికి నాకాడేం వుండది బూద్దె! రోజంతా కూల్జేస్తేవొచ్చిన ఆరనాలో అద్దరూపాయితోనో మా అమ్మా నేను తినంగా యింకేం వుంటందాడా! అసలు మా అయ్య పొలంగిలం పోనూక్కొని నందెలుగు సేరాడని తెలిసే అది పేసీ బెట్టింది."

"అలివేలేమంటదీ?"

"అదేమంటది. అమ్మన్జ్ఞత్తే అడలయితే. మండి- రంగమ్మని ఏందేందో అంటా లెగిశా"

"ఆఁ?"

అంత రోసం గలాడివయితే యాడకన్నా ఎల్లి డబ్బు సంపాయించుకు రారాదా అనింది రంగమ్మ. ఒక యాడాది అలివేల్ను నా కోసం వుంచుతానని మాటిత్తే అటనే సంపాయించుకొత్తానన్నా. వుంచుతానంది రంగమ్మ. యీ యవారం తనకి నచ్చక బొయినా, ఎల్లి ఎప్పుడొత్తానో కనిబెట్టుక్కూకుంటానంది అలివేలు... ఎంటనే నందెలుగునుంచి బయలెల్లా. ఎల్లీ ఎల్లీ ఎల్లీ- ఎటనయితేనేం సివరకి రేత్రింబగలూ పన్జేత్తే రూపాయిపావలా గిట్టుద్దని తెల్చి సాల్లే బగమంతుడా అనుకుంటా బెజవాడలో రామసెంద్రయ్యగారి ఏడ్జెనక్కాయ, ప్యాట్రీలో బత్తాలు మోసే పనికి వొప్పుకుండా. అది సానా పెద్ద ప్యాట్రీ! ఆడ యినప్పన్లని యింకా సానావుంటాన రామసెంద్రయ్యగారికి ఏలకి ఏలు లాబాలుండేవి. బలేచోటపడ్డాం గందా, ఎటనోగట్ట ఏడెందిమాసాలు తంటాలుబడ్తే అలివేల్ను పెల్లిచేసుకోవచ్చు గందా అనుకుంటా, రామసెంద్రయ్యగార్ని మెప్పిత్తా, అందరికన్న మిగులుగా బొహువుసారుమీన సెకసెకా బత్తాఎంటబత్తా మోత్తా పొయ్యేవోణ్ణి. తిండికి పావలా ఆరనాలకన్నా కరుజుపెట్టకుండా రోజుకి రూపాయో పద్దాలుగణాలో ఎనకేత్తా వచ్చా. ఆ వజాన రెణ్ణెల్లు గడిసేతలికి ఒల్లు కాత్త సెట్టం మొదలుబెట్టింది. ఆ బెజవాడ నీలు వుత్త సన్నాసినీలు గావాఁలా వొల్లు ఎచ్చగా వుంటం మొదులు బెట్టింది. పదిరోజులు వొంటిపూటే పన్జేసి కాత్తె సుమారుగా వుండమీదట మళ్లీ మామూలుగా పనిజేత్తా వొచ్చా. ఒకరోజు రేత్తిరి ఎయ్యి ఏడ్జెనగ పప్పుబస్తాలు మేం పదిమందిమి లోన గోతాలమీన పేరవాల్సొచ్చింది. వెూసేబత్తా ఏసేబత్తా-

లెగిసిపోతుండయి బత్తామీనబత్తా. రేత్తిరి రొండుగంటల యాలకు నా ముంగల బత్తామోసే కోటయ్య నెత్తిన బత్తాతో నిచ్చెన సివరకంటా ఎల్లాడు-నేను రొండు మూడు మెట్లెక్కా-వొల్లు తూలింది-యిగ నాకు తెలవదు ఆమీన ఏం జరిగిందీ... మూడోరోజుగ్గాని నాకు తెలివిరాలా - అప్పటికి రొండుదినాల కిందటే యీ కుడికాలు తొడలకాడికి ఆపరేసను జేశారంట."

"అరె. అరే ఎంతపన్జరిగిందీ-"

"నిచ్చెన ఎక్కుతుండోణ్ణల్లా అరుత్తా కల్లుదిరిగి అటనే పడ్డానంటా. ఆ అదురుడికి అదిరిపోయి కోటయ్య బత్తా అటనే వొదిలేసేతలికి - కిందబత్తామీనగా ఎల్లికిల పడుండ నా కుడికాలుమీనకి ఒచ్చి సరీగా పడిందంట."

"రామ రామ రామ... రామసెంద్రయగా రేమన్నాడూ?"

"ఆయనేం జేత్తాడు నా కావజాన రాసుంటే! రొండు మాసాలు ఆస్పత్తిర్లో మందేపించాడు, సాలు."

"ఎన్నాలయింది యిది జరిగీ?"

"రొండేళ్ళయింది."

"మరి అలివేలూ?"

"యింకేం అలివేలు!" అంది కళ్ళుగల యిగ్రహం.

ఏందో అనబోయి అట్టనే ఆగిపోయింది కళ్ళుమూసుకుండ యిగ్రహం.

**(అభ్యుదయ, 1948 డిశెంబరు)**